క్లుప్తంగా

పేదలకు దుప్పట్ల పంపిణీ

జగ్గంపేట: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఆదివారం కాట్రావులపల్లిలో షిర్డి సాయి సేవా సత్సంగం ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. దాతలు ముమ్మిడివరపు సత్యనారాయణ, సత్యవతి ఆర్థిక సహాయంతో పేదలకు దుప్పట్లు అందజేసినట్టు షిర్డీ సాయి సేవా సమితి సభ్యులు తెలిపారు.

మాజీ సైనిక ఉద్యోగికి ఘన స్వాగతం



కిర్లంపూడిలో అనిల్‌కు స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

కిర్లంపూడి: ఉద్యోగ విరమణ పొందిన సైనికుడికి కిర్లంపూడి, రమణయ్యపేట గ్రామాల ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. భారత సైన్యంలో సిపాయిగా సేవలందించిన అతికంశెట్టి ఏఎస్ రావు(అనిల్) శనివారం ఉద్యోగ విరమణ పొందారు. ఆదివారం స్వగ్రామానికి వచ్చిన ఆయనకు గ్రామస్తులు కేక్‌ను కట్ చేసి అపూర్వ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ ఒడిశా, జమ్మూకశ్మీర్, పంజాబ్, గుజరాత్, నాశిక్, శ్రీనగర్, చియాచిన్ వంటి పలు సరిహద్దు ప్రాంతాల్లో 17 ఏళ్ల పాటు సిపాయిగా సేవలందించినట్టు తెలిపారు.

సూపర్‌స్టార్ కృష్ణకు వినూత్నంగా నివాళులు



కృష్ణ నటనతో ఆకట్టుకున్న కృపావరం

ఏలేశ్వరం: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని సినీ నటుడు సూపర్ స్టార్ కృష్ణకు ఓ అభిమాని వినూత్నంగా నివాళులర్పించాడు. పట్టణానికి చెందిన ముప్పిడి కృపావరం సినీ నటుడు కృష్ణకు వీరాభిమాని. హీరో కృష్ణ వేషధారణతో రికార్డింగ్ డ్యాన్సులు చేస్తుంటాడు. నూతన సంవత్సరం సందర్భంగా కృష్ణకు నివాళులర్పించాలని భావించాడు. దీనిలో భాగంగా కృష్ణ వేషధారణతో ట్రాక్టర్‌పై మైకుసెట్‌లు ఏర్పాటు చేసి పట్టణమంతా ఊరేగింపు నిర్వహించి కృష్ణ స్మృతికి నివాళులర్పించాడు.

డైరీ ఆవిష్కరణ



గోకవరం ఆర్టీసీ డిపోలో డైరీని ఆవిష్కరిస్తున్న డిపో మేనేజర్ రామన్న

గోకవరం: స్థానిక ఆర్టీసీ డిపోలో ఆదివారం సీసీఎస్ డైరీని ఆవిష్కరించారు. ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో డిపో మేనేజర్ యు.రామన్న ముఖ్యఅతిథిగా పాల్గొని డైరీని ఆవిష్కరించారు. నూతన సంవత్సరం సందర్భంగా డిపోలోని ఉద్యోగులకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పైడిమళ్ల లక్ష్మణరావు, ప్రగఢ ప్రసాద్, అక్కిరెడ్డి కృష్ణ, అప్పాజీ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మ జాతర ప్రారంభం



పి.నాయకంపల్లి పోలేరమ్మ జాతరలో గరగల నృత్యాలు

గండేపల్లి: మండలంలోని పి.నాయకంపల్లిలో వేంచేసిన పోలేరమ్మ అమ్మవారి జాతర ఆదివారం ప్రారంభమైంది. గరగ నృత్యాలు, డప్పు వాయిద్యాలతో అమ్మవారిని గ్రామంలో ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

హరిదాసుకు సన్మానం



ధర్మవరంలో హరిదాసు రామకృష్ణను సన్మానిస్తున్న దృశ్యం

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరంలో హరిదాసు వారాల రామకృష్ణను గ్రామ పెద్దలు ఆదివారం ఘనంగా సన్మానించారు. గ్రామంలో నగర సంకీర్తనలు నిర్వహిస్తూ హిందూ సంప్రదాయ పరిరక్షణకు కృషి చేస్తున్న హరిదాసు రామకృష్ణను సత్కరించడం అదృష్టంగా భావిస్తున్నట్టు గ్రామస్తులు తెలిపారు.



కోటనందూరులో ఎంపీపీ శ్రీనివాసుకు శుభాకాంక్షలు తెలుపుతున్న మహిళలు



ఎస్.అన్నవరంలో వేంకటేశ్వరస్వామి పూలంగిసేవకు పుష్పాలను తీసుకువెళుతున్న ధర్మకర్తలు, భక్తులు



ఏలేశ్వరంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అలమండ సత్యవతికి శుభాకాంక్షలు తెలుపుతున్న సచివాలయ సిబ్బంది



పెద్దనాపల్లిలో ఎంపీపీ గొల్లపల్లి బుజ్జికి శుభాకాంక్షలు తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కోటి ఆశలతో కొత్త ఏడాదికి స్వాగతం



శంఖవరంలో ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్‌కు గజమాల వేస్తున్న అభిమానులు

- ఘనంగా న్యూ ఇయర్ వేడుకలు
- ప్రజాప్రతినిధుల ఇళ్ల వద్ద సందడి
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు

ఏలేశ్వరం: తమ జీవితాల్లో వెలుగులు నింపాలని కోరుతూ నూతన సంవత్సరానికి ప్రజలు స్వాగతం పలికారు. తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో ఆదివారం న్యూ ఇయర్ వేడుకలు వైభవంగా జరిగాయి. ఉదయం నుంచి ఒకరికొకరు ఆప్యాయంగా విష్ చేసుకున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులకు స్వీట్లు, పండ్లు, బొకెలు, గ్రీటింగ్స్ కార్డులు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. దీంతో గ్రామాల్లో పండగ వాతావరణం నెలకొంది. ఏలేశ్వరంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అలమండ సత్యవతి, వైస్ చైర్‌పర్సన్ శిడగం త్రివేణి, మున్సిపల్ కౌన్సిలర్లు బదిరెడ్డి గోవిందు, మూదినారాయణస్వామి, బొదిరెడ్డిగోపి, జువ్విన వీర్రాజు ఇళ్ల వద్ద వేడుకలు నిర్వహించారు. పెద్దనాపల్లిలో ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, యర్రవరంలో జెడ్పీటీసీ నీరుకొండ రామకుమారి ఇళ్లకు స్థానిక నాయకులు, అభిమానులు భారీగా తరలివెళ్లి శుభాకాంక్షలు తెలిపారు.

శంఖవరం: ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ స్వగ్రామం శంఖవరంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అధికారులు భారీగా తరలివచ్చి ఎమ్మెల్యేకు పూలమాలలు, బొకేలతో శుభాకాంక్షలు తెలిపారు. పలువురు అభిమానులు విద్యార్థులకు అవసరమయ్యే పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, ఇతర సామగ్రి తీసుకొచ్చి శుభాకాంక్షలు చెప్పారు. ఎమ్మెల్యే ఇంటికి వేలాదిగా అభిమానులు రావడంతో రోడ్లన్నీ రద్దీగా మారాయి. తనకు శుభాకాంక్షలు చేసేందుకు వచ్చే వారికి ఇబ్బంది కలగకూడదనే ఉద్దేశ్యంతో ఎమ్మెల్యే భారీ ఏర్పాట్లు చేశారు. వివిధ గ్రామాల నుంచి బైక్ ర్యాలీలతో అభిమానులు వచ్చారు. వారందరికీ ఎమ్మెల్యే ప్రత్యేకంగా భోజనం సౌకర్యం కల్పించారు. ప్రతిఒక్కరినీ పేరు పేరున పలకరించి అభిమానులు ఆనందాన్ని రెట్టింపు చేశారు. కార్యక్రమంలో శెట్టిబత్తుల కుమార్ రాజా, ఈగల అప్పారావు, బదిరెడ్డి గోవింద్, కూనిశెట్టి మాణిక్యం, గొంతిన సురేష్, బెహరా దొరబాబు, గొల్లు చిన్నదివాణం తదితరులు పాల్గొన్నారు.



గండేపల్లి మండలం మురారిలో కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ చలగళ్ల దొరబాబు



కిర్లంపూడిలో కేక్ కట్ చేసి సంబరాలు చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కిర్లంపూడి: స్థానిక సొసైటీ చైర్మన్ చదలవాడ బాబి నివాసంలో ఏర్పాటు చేసిన నూతన సంవత్సర వేడుకల్లో వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు దోమాల గంగాధర్ ముఖ్య అతిథిగా పాల్గొని కేక్ కట్ చేశారు. గోరకపూడి వెంకట్రావు చారిటబుల్ అధ్యక్షుడు గొరకపూడి గోపీనాథ్, గణేశుల రాంబాబు, తోట విష్ణు స్వగృహాల్లో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు.

ప్రత్తిపాడు రూరల్: మండల వ్యాప్తంగా న్యూ ఇయర్ వేడుకలు ఘనంగా జరిగాయి. చిన్నారులు గ్రీటింగ్స్, ప్రముఖులు బుకేలతో, యువత సోషల్ మీడియా ద్వారా నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పుకున్నారు. మహిళలు తమ ఇళ్ల ముందు రంగు రంగుల ముగ్గులు వేసి నూతన సంవత్సరానికి స్వగతం పలికారు.

తుని రూరల్: తుని రాజా కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన నూతన సంవత్సర వేడుకల్లో మండలానికి చెందిన ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొని రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెటి రాజాకు శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము, జెడ్పీటీసీ పోతల సూర్యమణి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతల రమణ, తుని ఏరియా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు పోతుల లక్ష్మణ్, మండల వ్యవసాయ సలహ మండలి చైర్మన్ చోడ్రాజు రాంబాబురాజు సహచరులతో మంత్రి దాడిశెట్టి రాజాను కలసి శుభాకాంక్షలు తెలిపారు. కొత్త ఏడాది కావడంతో వేలాది మంది భక్తులు ఎస్.అన్నవరం, ఎన్.సూరవరం గ్రామాల్లో కొలువైన వేంకటేశ్వరస్వామిని దర్శించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఎస్.అన్నవరంలో పాత సంచుల వర్తక సంఘం ఆధ్వర్యంలో వివిధ రకాల పూలతో ప్రసన్న వేంకటేశ్వరస్వామికి పూలంగి సేవ, శ్రీపుష్పయాగం నిర్వహించారు.

గోకవరం: మండల వ్యాప్తంగా నూతన సంవత్సర వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. అర్ధరాత్రి 12 గంటలు దాటిన వెంటనే ప్రజలు వీధుల్లోకి వచ్చి తమ ఆత్మీయులు, బంధువులు, స్నేహితులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కేక్‌లు కట్ చేసి ఒకరికి ఒకరు తినిపించుకుంటూ తమ ఆనందాన్ని పంచుకున్నారు. బాణాసంచా కాల్చి సందడి చేశారు. పలు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మహిళలు రంగవల్లులు వేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గోకవరం ఎస్సై యువి శివనాగబాబు ఆధ్వర్యంలో సిబ్బంది గస్తీ నిర్వహించారు.

ప్రత్తిపాడు: గ్రామంలో ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బెహరా దొరబాబు, గ్రామ సర్పంచ్ గుడాల విజయలక్ష్మి స్వగృహాల వద్ద నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు.

కోటనందూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ లగుడు శ్రీనివాసు, కో-ఆపరేటివ్ సొసైటీలో సొసైటీ అధ్యక్షుడు గొర్లి రామచంద్రరావు, కాకరాపల్లిలో వ్యవసాయ సలహా మండలి జిల్లా అధ్యక్షుడు లంక ప్రసాద్ ఆధ్వర్యంలో న్యూ ఇయర్ వేడుకలు నిర్వహించారు.

గండేపల్లి: మండల వ్యాప్తంగా న్యూ ఇయర్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఎంపీపీ చలగళ్ల దొరబాబు, జెడ్పీటీసీ పరిమి మంగతాయారు బాబు, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు కందుల చిట్టిబాబు, వైఎస్ ఎంపీపీ కుంచే రాజాలకు పార్టీ నాయకులు, అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.

జగ్గంపేట: గ్రామంలో వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఒమ్మి రఘురాం, ఎంపీపీ అత్తులూరి నాగబాబు, ఉప సర్పంచ్ బండారు రాజా ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. పార్టీ నాయకులు, అధికారులు, ప్రజలు వారికి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

రత్నగిరిపై..

అన్నవరం: రత్నగిరిపై నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. అన్నవరం దేవస్థానం తరఫున రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా, ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్‌కు దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ సత్యనారాయణ మూర్తి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.



పెద్దిపాలెంలో గ్రీటింగ్‌తో నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పుకుంటున్న విద్యార్థులు

ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి

- మంత్రి దాడిశెట్టి రాజా



తునిలో మంత్రి దాడిశెట్టి రాజాకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

తుని: కొత్త సంవత్సరంలో ప్రజలు సుఖశాంతులతో సంతోషంగా ఉండాలని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా ఆకాంక్షించారు. స్థానిక రాజా కళాశాల మైదానంలో ఆదివారం వేలాది మంది అభిమానులు, ప్రజలు, వైఎస్సార్ సీపీ నాయకులు, అధికారులతో కలిసి మంత్రి దాడిశెట్టి రాజా కొత్త సంవత్సర వేడుకలు నిర్వహించారు. అభిమానులు ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేసి ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. తుని, తొండంగి, కోటనందూరు మండలాలు, తుని పట్టణానికి చెందిన నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు తరలివచ్చారు. సభాప్రాంగణం జనసంద్రంగా మారింది. మంత్రి అందరినీ ఆప్యాయంగా పలికరించి ప్రేమను చాటుకున్నారు. ఇక్కడకు వచ్చిన అందరికీ భోజన సదుపాయం కల్పించారు. ఈ సందర్భంగా మంత్రి రాజా మాట్లాడుతూ కొత్త సంవత్సరంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనించాలన్నారు. రైతులు పాడి పంటలతో ఆనందంగా ఉండాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. కొత్త సంవత్సర కానుకగా పింఛన్ దారులకు రూ.2750 ఇవ్వడంతో అవ్వాతాతల కళ్లల్లో ఆనందం చూశామన్నారు. ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. రాష్ట్ర పెరికి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పురుషోత్తం గంగా భవానీ, మాల కార్పొరేషన్ చైర్మన్ పెదపాటి అమ్మాజీ, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ మేరుగ పద్మలత, మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి, మార్కెట్ కమిటీ చైర్మన్ మాకినీడి బాబు, దాడిశెట్టి నరసయ్య చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్ దాడిశెట్టి శ్రీనివాస్, ఎంపీపీలు లగుడు శ్రీనివాస్, బొప్పన రాము, అంగుళూరి అరుణ్‌కుమార్, జెడ్పీటీసీ పోతల సూర్యామణి, వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గ అధ్యక్షుడు ఏలూరి బాలు, గాంధీసత్రం చైర్మన్ అనిశెట్టి సూర్యచక్రరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పామర్తి మహేష్, పోతుల లక్ష్మణ్, సర్పంచులు, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

ఆనందమనిపింఛన్



ప్రత్తిపాడు మండలం ఒమ్మంగిలో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



తొండంగి మండలం ఏవీ నగరంలో వృద్ధురాలికి పింఛను అందజేస్తున్న సర్పంచ్ కొయ్యా జగదీశ్వరి



ఏలేశ్వరంలో వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న మున్సిపల్ కౌన్సిలర్ వాగుబలరామ్

- పెరిగిన పెన్షన్ల సొమ్ము
- వృద్ధులు, వికలాంగులకు రూ.2750 చొప్పున పంపిణీ
- హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

ఏలేశ్వరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల హామీల అమలే లక్ష్యంగా పని చేస్తున్నారు. ఇప్పటికే 98 శాతం ఎన్నికల హామీలను అమలు చేశారు. పింఛను దారులకు ఇచ్చిన మాట ప్రకారం ఈ నెల నుంచి పింఛన్ల సొమ్మును పెంచారు. ఈ నెల నుంచి వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు రూ.2750 చొప్పున ఫింఛన్లు అందజేయనున్నారు. కొత్త సంవత్సరంలో పెంచిన పింఛన్ సొమ్ము అందుకోవడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

24 వేల మందికి..

ప్రత్తిపాడు నియోజవర్గంలో 24 వేల మందికి వృద్ధాప్య, వితంతువు, వికలాంగ పింఛన్లు అందజేస్తున్నారు. రాష్ట్రప్రభుత్వం ఆదేశాల మేరకు వలంటీర్లు ప్రతినెలా ఒకటో తారీఖున లబ్ధిదారులకు పింఛన్లు అందజేస్తున్నారు. గతంలో పింఛన్లు కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగేవాళ్లమని, ప్రస్తుతం ఇంటికే పింఛన్ల సొమ్ము తెచ్చి ఇవ్వడంపై లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

36 శాతం పింఛన్ల పంపిణీ

ప్రత్తిపాడు: మండల వ్యాప్తంగా ఆదివారం తొలిరోజు 36 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయ్యింది. మండలంలోని 23 గ్రామ సచివాలయాల పరిధిలో 11,582 మంది పింఛనుదారులుండగా సాయంత్రం 5 గంటలకు 4,200 మందికి వలంటీర్లు పింఛన్లు బట్వాడా చేసినట్టు ఎంపీడీఓ ఎస్. వెంకటాచలం తెలిపారు. కాగా మండలానికి నూతనంగా మరో 114 పింఛన్లు మంజూరైనట్టు ఆయన వివరించారు.

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరం, ఒమ్మంగి, రాచపల్లి, పెద్దిపాలెం, ఉత్తరకంచి, రౌతుపాలెం, శరభవరం, గజ్జనపూడి, యూజే పురం, వాకపల్లి, పోతులూరు, గోకవరం తదితర గ్రామాల్లో లబ్ధిదారులకు ఆదివారం వైఎస్సార్ సీపీ మండల నేత రామిశెట్టి చినబాబు పింఛన్లు పంపిణీ చేశారు.



ప్రత్తిపాడు యానాదిపేటలో వృద్ధురాలు సీతయ్యమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ జ్యోతి

323 మందికి కొత్త పెన్షన్లు

కోటనందూరు: మండలంలో కొత్తగా 323 మందికి పింఛన్లు మంజూరైనట్లు ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ ఆదివారం తెలిపారు. పెరిగిన పెన్షనర్లతో పాటు కొత్త పింఛనుదారులు 7,805 మందికి రూ.2.15 కోట్లు పంపిణీ చేయనున్నట్లు వివరించారు. టీజే నగరంలో లబ్ధిదారు తమ్మి నూకాలమ్మకు వలంటీర్ భూపతి శివతో కలిసి ఎంపీపీ లగుడు శ్రీనివాసు పింఛను పంపిణీ చేశారు. పింఛన్ల సొమ్ము పెంచడం పట్ల లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. సర్పంచ్ సుర్ల రాంబాబు, వ్యవసాయ సలహామండలి మండలాధ్యక్షుడు సుర్ల రాజు, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

తొండంగి: మండలంలోని ఏవీ నగరంలో లబ్ధిదారులకు గ్రామ సర్పంచ్ కొయ్యా జగదీశ్వరి పింఛన్లు పంపిణీ చేశారు. వృద్ధులు, వికలాంగులకు పెరిగిన పింఛను రూ.2750 అందజేయడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. తుని ఏఎంసీ మాజీ చైర్మన్ కొయ్యా మురళీకృష్ణ, పంచాయతీ కార్యదర్శి బి.ప్రేమ కుమార్, దుళ్ల చెల్లారావు పాల్గొన్నారు.



కిర్లంపూడి మండలం జగపతినగరంలో లబ్ధిదారులకు ఫింఛన్లు అందజేస్తున్న వలంటీర్లు



టీజే నగరంలో లబ్ధిదారు నూకాలమ్మకు పింఛను అందజేస్తున్న ఎంపీపీ లగుడు శ్రీనివాసు

జలకళతో మెట్ట భూములు సస్యశ్యామలం



అటికివానిపాలెంలో బోరుబావుల తవ్వకాన్ని ప్రారంభిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తుని రూరల్: వైఎస్సార్ జలకళ పథకంతో మెట్ట భూములు సస్యశ్యామలం అవుతున్నాయని వైఎస్సార్ సీపీ నాయకుడు చిటికెల వరహాలబాబు అన్నారు. మండలంలోని అటికివానిపాలెంలో ఆదివారం జలకళ పథకంలో బోరు బావుల తవ్వకాన్ని గ్రామ ఉప సర్పంచ్ అటికే వీర్రాజుతో కలసి ఆయన ప్రారంభించారు. ఎటువంటి సాగునీటి వసతులు లేని ఈ గ్రామంలో తొమ్మిది బోరుబావులు తవ్వడం వల్ల చిన్న, సన్నకారు రైతుల భూములకు సాగునీరు లభించనుందన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో బోరుబావి తవ్వడంతో పాటు అవసరమైన విద్యుత్ పంపుసెట్‌ను అందిస్తున్నట్టు తెలిపారు. జలకళ పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నాయకులు గోసుల కృష్ణ, గుత్తుర్తి గంగరాజు, మాస దుర్గ, పెంట మహేష్, పంచాయతీ వార్డు సభ్యులు గంపల ఎల్లయ్య, మోటుకూరి దుర్గ, పెల్లపు ప్రసాద్, ఎఫ్ఏ కిల్లాడ రామకృష్ణ పాల్గొన్నారు.

ముక్కోటి ఏకాదశి పూజలకు ఏర్పాట్లు

గోకవరం: ముక్కోటి ఏకాదశిని పురస్కరించు కుని సోమవారం ఆలయాల్లో ఉత్తరద్వార దర్శనానికి ఏర్పాట్లు చేశారు. మండలంలోని తంటికొండలో ప్రసిద్ధిగాంచిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి పూజలు వైభవంగా నిర్వహించనున్నారు. తెల్లవారుజామున ఉత్తరద్వార దర్శనానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు దేవస్థానం చైర్మన్ బద్దిరెడ్డి రాంబాబు(రెడ్డి), ఈఓ ఆర్‌వీ చందన తెలిపారు. గోకవరం రమాసత్యనారాయణస్వామి ఆలయంలో ఉత్తరద్వార దర్శనానికి చేసినట్టు ఆలయ అర్చకులు ఆరవిల్లి సీతారామాచార్యులు, వల్లూరి జగన్నాథశర్మ, శ్రీనివాస్‌శర్మ తెలిపారు. గ్రామాల్లోని వైష్ణవాలయాల్లో ముక్కోటి ఏకాదశి ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

ముక్కోటి ఏకాదశికి ఏర్పాట్లు పూర్తి

గండేపల్లి: ముక్కోటి ఏకాదశి సందర్భంగా తాళ్లూరు శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి (జీయ్యన్న మఠం) ఆలయంలో ఉత్తర ద్వారా దర్శన ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఈఓ శ్రీనివాస్ తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఒబిణ్ని వీరబాబు, ఎంపీటీసీ చెల్లూరి రాంబాబు ఏర్పాట్లను పరిశీలించారు.

సైకిల్ షాపు వర్కర్లకు న్యాయం చేయాలి

తుని: సైకిల్ షాపు వర్కర్స్‌కు ప్రభుత్వం న్యాయం చేయాలని ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు సోమేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. తుని మండలం తలుపులమ్మలోవలో ఆదివారం కాకినాడ జిల్లా సైకిల్‌షాపు వర్కర్స్ యూనియన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సోమేశ్వరరావు మాట్లాడుతూ బ్రిటిష్ కాలం నుంచి ఎంతో ప్రాధాన్యం ఉన్న సైకిల్‌షాపు వర్కర్లను ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సైకిల్‌షాపు వర్కర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, పింఛను ఇచ్చి ఆదుకోవాలని కోరారు. సీఐటీయూ నాయకులు నక్కెళ్ల శ్రీనివాస్, రమణ, నాగేశ్వరరావు, తుని సైకిల్‌షాపు వర్కర్ల సంఘం అధ్యక్షుడు భాస్కరరావు, కార్యదర్శి రమణ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



పెద్దిపాలెంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న బీసీ నేతలు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని పెద్దిపాలెంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆదివారం ఆంధ్రప్రదేశ్ యాదవ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుర్రా శ్రీనివాసరావు, తెలుగు జనతా పార్టీ అధ్యక్షుడు పెద్దింశెట్టి వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. గ్రామంలో అనూష యాదవ్ ఆధ్వర్యంలో నూతన నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవర వెంకటరమణ, ముప్పల శ్రీను, గంగరాజు, మొల్లి కొండలరావు, నైదాన రఘు, కిల్లాడ నూకరాజు, సారిపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.